

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు


రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విధి నిర్వహణలో అలసత్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి 30వ వార్డులో శానిటేషన్ వర్కర్లతో మాట్లాడారు. శానిటేషన్ పనులపై అరా తీశారు. తాను పట్టణంలో ఎక్కడికి వెళ్లినా పారిశుధ్యంపై ఫిర్యాదు వస్తున్నాయని, చెత్త తొలగించడం లేదని, ఫాగింగ్ చేయడం లేదని, డ్రెయినేజీలు పూడుకుపోయాయని, దోమల బెడద ఎక్కువగా ఉందని చెబుతున్నారన్నారు. ఈ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నిర్వాసితుల సమస్యలపై.. పార్లమెంట్‌లో పోరాడతా

- లక్షకుపైగా కుటుంబాల గురించి పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- భూమి, విద్య, వైద్యం, ఇళ్లు వంటి అన్ని వసతులూ కల్పించాల్సిందే
- కాంటూరుతో సంబంధం లేకుండా పునరావాసం, పరిహారం ఇవ్వాలి
- సిపిఎం రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్
- బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని నిర్వాసిత, గిరిజన గ్రామాల్లో పర్యటన
- అడుగడుగునా ఘనస్వాగతం, ఆపై సమస్యలు ఏకరువు పెట్టిన ఆదివాసీలు



జాన్ బ్రిట్టాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు



పునరావాస కాలనీలో ఇంటిని పరిశీలిస్తున్న నేతలు



జాన్ బ్రిట్టాస్‌కు ఘనస్వాగతం పలుకుతున్న సిపిఎం శ్రేణులు



వృద్ధురాలితో ముచ్చటిస్తున్న బ్రిట్టాస్

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి

'పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో లక్షా ఆరు వేల కుటుంబాలు ప్రభావితమవుతున్నాయి. ఆ కుటుంబాలకు ఇవ్వాల్సిన పరిహారం, పునరావాస ప్యాకేజీ, విద్య, వైద్యం, ఇళ్లు వంటి ఏఒక్క సదుపాయంపైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిర్వాసితుల్లో 80 శాతం గిరిజనులే ఉన్నారు. నిర్వాసితుల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడతాం. సమస్యల పరిష్కారానికి పోరాటమే మనకు ఆయుధం' అని రాజ్యసభ సభ్యులు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ జాన్ బ్రిట్టాస్ అన్నారు. శనివారం ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయన రోడ్డు మార్గం గుండా ఏలూరు చేరుకున్నారు. ఆయనకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.రామకృష్ణ స్వాగతం పలికారు. భోజన అనంతరం రోడ్డు మార్గం గుండా ఏజెన్సీ ప్రాంతానికి ఆయన బయల్దేరారు. జంగారెడ్డిగూడెం పొలిమేరకు వచ్చేటప్పటికీ సిపిఎం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, ఎం.జీవరత్నం, పి.సూర్యారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, అంగన్‌వాడీలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీగా బుట్టాయగూడెం మండలం బయలుదేరారు. బుట్టాయగూడెం పొలిమేరల్లో సిపిఎం నాయకులు మొడియం నాగమణి, తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు డప్పులు, వాయిద్యాలతో స్వాగతం పలికి పూలమాలలు వేశారు. గిరిజనులు బ్రిట్టాస్, నేతల నుదుటిన తిలకం దిద్ది ఆహ్వానించారు. అక్కడి నుంచి ర్యాలీగా రెడ్డిగణపవరం చేరుకుని ఆ పంచాయతీ పరిధిలోని బండార్లగూడెంలో గిరిజన పోరాట యోధుడు కొమరం బాబూరావు, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి అరుణాంజలి ఘటించారు. అనంతరం అక్కడ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగిన సభలో గిరిజనులనుద్దేశించి జాన్‌బ్రిట్టాస్ మాట్లాడారు. తొలుత రవి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులు, కాలనీల సమస్యలు, అక్రమ భూసేకరణ వంటి వివరాలు వెల్లడించారు. జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ గిరిజనులు, దళితులు అణగారిన వర్గాల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. భూమి, విద్య, వైద్యం, ఇళ్లు వంటి సమస్యల గురించి ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. అందరూ ఐకమత్యంతో కలిసి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పేదలకు విద్య, వైద్యం వంటివాటికి పెద్దపీట వేస్తుందన్నారు. గిరిజన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గిరిజన భూములు వారికి చెందే విధంగా రక్షణ కల్పిస్తుందని చెప్పారు. ఆంధ్రాలో ఎంపీలంతా ధనవంతులని, అణగారినవారి బాధలు వారికి పట్టడం లేదని తెలిపారు. ఎపి, కేంద్ర ప్రభుత్వాలు పేదల గురించి మాటలు చెప్పడం తప్ప ఆచరణలో ఏమీ లేదన్నారు. ఎర్రజెండా అందరికీ అండగా నిలిచి పోరాడుతుందన్నారు. పార్లమెంట్‌లో మీ సమస్యలపై మాట్లాడతానని చెప్పారు. అమరజీవి కొమరం బాబూరావు ఎర్రజెండా స్ఫూర్తితో అందరం ముందుకు సాగాలన్నారు. అక్కడ గిరిజనులు ఇచ్చిన వినతులను ఆయన స్వీకరించారు.

టేకూరు కాలనీలో నేరుగా సమస్యల పరిశీలన

అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా జీలుగుమిల్లి మండలంలోని టేకూరు కాలనీకి చేరుకున్నారు. కాలనీ నిర్వాసితులంతా పెద్దఎత్తున ఆయనకు స్వాగతం పలికారు. గిరిజనుడు బడగంటి వరహాలరెడ్డి వర్షాలకు తన ఇంటిలో నీరు కారుతుందని చెప్పడంతో ఆ ఇంటికి వెళ్లి బ్రిట్టాస్ పరిశీలించారు. వరహాలరెడ్డి తల్లి వృద్ధురాలు వాగాయమ్మను ఆప్యాయతతో పలకరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. నిర్వాసితులు పెద్దఎత్తున తమ వినతులు తీసుకొచ్చి ఆయనకు ఇచ్చారు. అందులో భూమికి భూమి ఇవ్వలేదని, పోడు భూములకు నష్టపరిహారం ఇవ్వలేదని, 18 ఏళ్లు నిండినవారికి ప్యాకేజీ ఇవ్వలేదని అనేక సమస్యలను తెలిపారు. టేకూరులో సభకు అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ముందుగా నిర్వాసితుల సమస్యలను వివరించారు. అనంతరం జాన్‌బ్రిట్టాస్ మాట్లాడారు. 2004లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో వామపక్షాలు మద్దతు ఇచ్చాయని, అప్పుడు కీలకమైన సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ చట్టం, విద్యాహక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం, ఆహార భద్రత చట్టం వంటి ఐదు కీలక చట్టాలను తీసుకొచ్చామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టాలను సరిగా అమలు చేయడం లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్‌తోపాటు అన్ని వసతులూ కల్పించి ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండినవారికి పునరావాసం ఇవ్వాలన్నారు. గ్రామం నుంచి ఖాళీ చేసిన రోజు పరిగణనలోకి తీసుకుని పునరావాసం ఇవ్వాలన్నారు. దేశంలో పెద్ద ప్రాజెక్టు సర్దార్ సరోవర్ ప్రాజెక్టులో కూడా లక్షల మందిని ఇబ్బందులు పెట్టారన్నారు. రూ.80 వేల కోట్లతో కృష్ణా-గోదావరి అనుసంధాన ప్రాజెక్టు చేపడుతున్నారని, సర్వం కోల్పోతున్న ప్రజలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జాన్ బ్రిట్టాస్ ఇంగ్లీష్‌లో మాట్లాడగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, తులసీదాస్ తెలుగులోకి అనువాదం చేశారు. మరోసారి వచ్చేటప్పుడు తెలుగు నేర్చుకుని మీతో మాట్లాడతానని, మీ సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడంతోపాటు రాష్ట్రపతి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని బ్రిట్టాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల, నాయకులు లెనిన్, మంగరాజు, ఎ.ఫ్రాన్సిస్, జి.వెంకట్రావు, తామ ముత్యాలమ్మ, గంగుల రమేష్, ఎం.దుర్గారావు, కె.భాస్కర్, కొరసా జలపాలు, సిరిబత్తుల సీతారామయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

భూమి లేదు.. ఇల్లూ లేదు



ఎ.అంజలి, బర్రింకలపాడు

మాది వేలేరుపాడు మండలం అల్లూరునగర్. గతంలో వరదలకు మా ఇళ్లతో సహా అన్నీ కోల్పోయాం. ఇప్పటివరకు మాకు భూమికి భూమి కాని, ఇల్లు కాని నిర్మించలేదు. బర్రింకలపాడులో మా అమ్మవాళ్లింట్లో ఉంటున్నా. పునరావాస ప్యాకేజీ ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

ఇంటి పరిహారం రాలేదు.. కాలనీలో వసతుల్లేవు




కె.సుజాత, సిరివాక కాలనీ

మేము సిరివాక గ్రామం నుంచి తరలివచ్చాం. ఇప్పటివరకు ఇంటి పరిహారం ఇవ్వలేదు. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక సదుపాయాలు లేవు. పోడు భూములకు నష్టపరిహారం ఇవ్వలేదు. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

గోదావరికి పెరుగుతున్న వరద

పోలవరం నుండి 4,31,813 క్యూసెక్కుల జలాలు విడుదల



వేలేరుపాడు: ఎద్దు వాగు కాజ్‌వేపైకి చేరిన నీరు

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద క్రమేపీ పెరుగుతోంది. దీనికితోడు గోదావరి ఉపనదులు కడెం, మంజీర హరిద్ర, ఇంద్రావతి, మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి, సీలేరు నదుల నుండి, కొండవాగుల నుండి గోదావరిలోకి వస్తున్న జలాలతో గోదావరి నీటిమట్టం రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతోంది. దీంతో పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 4,31,813 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 29.680 మీటర్లు, దిగువన 20.240 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 29.950 మీటర్లు దిగువ కాపర్ డ్యామ్ దిగువన 19.800 మీటర్లు ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.990 మీటర్లు నమోదైనట్లు ఇఇ శ్రీనివాసరావు తెలిపారు.

వేలేరుపాడు: గోదావరి వరద భద్రాచలం వద్ద 29 అడుగులు దాటడంతో మండలంలో కొయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద ఎద్దువాగు కాజ్‌వే మునిగిపోవడంతో కోయిదా, కట్కూరు, సిద్ధారం, టేకూరు, కాకిసనూరు, తాళ్లగొంది, పూచిగొంది తదితర 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద తగ్గుముఖం పడుతుందా లేక గ్రామాలు వదిలి వెళ్లాల్సి ఉంటుందా అని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

కుక్కునూరు రూరల్: గోదావరికి వరద తాకిడి పెరగడంతో మండలంలోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వేపైకి వరదనీరు చేరుతోంది. ఆదివారం ఉదయం నాటికి గోదావరి వరద ఉధృతి ఇలానే కొనసాగితే ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఉంది. గోదావరి వరదతో పత్తి రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



మాట్లాడుతున్న జి.బేబిరాణి

పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలం

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి

ఉత్సాహభరితంగా సాగిన అంగన్వాడీ జిల్లా మహాసభ



హాజరైన అంగన్వాడీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని, లేకపోతే పాలకులు కార్మికులను పట్టించుకునే పరిస్థితి లేదని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి అన్నారు. అంగన్వాడీ యూనియన్ 9వ జిల్లా మహాసభ శనివారం స్థానిక రోటరీ క్లబ్‌లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. తొలుత అంగన్వాడీ యూనియన్ పతాకాన్ని జిల్లా అధ్యక్షులు పి.సుజాత ఆవిష్కరించారు. అనంతరం మహాసభ అధ్యక్ష వర్గాన్ని, మినిట్స్, తీర్మానాల కమిటీని ఎన్నుకుంది. పి.సుజాత, టి.రజిని, బిజెఎన్.కుమారి, ఇందిర, షకీలాభాను అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సంతాప తీర్మానాన్ని యూనియన్ కోశాధికారి టి.మాణిక్యం ప్రవేశపెట్టారు. ప్రారంభ సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడారు. అనంతరం మూడు సంవత్సరాల కార్యకలాపాల నివేదికను జిల్లా కార్యదర్శి భారతి ప్రవేశపెట్టారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు కూటమి అనేక హామీలిచ్చిందని, అధికారంలోకొచ్చాక వాటి ఊసే లేదని విమర్శించారు. ఆన్‌లైన్ పనుల సమస్య అలానే ఉందని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తామని కార్యాచరణకు నోచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేయని సెల్‌ఫోన్లు ఇచ్చి ఆన్‌లైన్ పనులు చేయాలంటే ఎలాగని ప్రశ్నించారు. బాలింతలు, గర్భిణులతో ఎఫ్‌ఆర్‌ఎస్ చేయలేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. క్వాలిటీ లేని ఫీడింగ్ ఇచ్చి దానిని పోషకాహారం అనడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 21న దేశవ్యాప్తంగా ఎఫ్‌ఆర్‌ఎస్‌పై బ్లాక్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో అంగన్వాడీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సభలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు నేతలు వై.సాయికిరణ్, పి.సూర్యారావు, అంగన్వాడీ జిల్లా నాయకులు తులసి, హైమావతి, పుష్ప, లత, నాగలక్ష్మి, నేతలు విమల, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెమో 57 ప్రకారం ఒపిఎస్ అమలుకు 25న మహాధర్నా

పోస్టర్ ఆవిష్కరించిన ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలు




పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ సాధనకు ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిఎస్‌సి-2003 ఉపాధ్యాయుల ఫోరం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఇరిగేషన్ గెస్టుహౌస్‌లో మహాధర్నా పోస్టర్‌ను ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, జెఎసి జిల్లా నాయకులు హరినాథ్, ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ జి.మోహన్, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు ప్రకాష్, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారావు ఆవిష్కరించారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కెఎల్.శ్రీనాథ్, కట్టా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పెన్షన్ విధానం అమలుకు ముందు అంటే 2004 సెప్టెంబర్ ఒకటో తేదీకి ముందు నియామక నోటిఫికేషన్లు విడుదలై, తర్వాత నియామకం జరిగి సిపిఎస్ విధానంలో ఉన్న సుమారు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. దీనిపై గత ఐదేళ్లుగా ప్రభుత్వ పెద్దలకు అనేక వినతి పత్రాలిచ్చినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నెల 25న మహాధర్నా చేపట్టామన్నారు. ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెమో 57 ప్రకారం 16 రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరించారని, అక్షర క్రమంలో ముందున్న మన రాష్ట్రంలో మాత్రం ఇంకా దానిపై నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు వి.జగదీష్, ఇ.శంకర్రావు, ఫోరం సభ్యులు కె.గోపాలకృష్ణ, బి.శ్రీనివాసరావు, వి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమం

జయంతి వేడుకలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బడుగు, బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు, త్యాగాలు చేసిన ఘనత సర్దార్ గౌతు లచ్చన్న సొంతం అని అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గౌతు లచ్చన్న వంటి మహనీయుల సేవలు చిరస్మరణీయమన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా స్థానిక ఆర్‌టిసి బస్టాండు సెంటర్లో విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే కితాబు పొందిన రెండో వ్యక్తి గౌతు లచ్చన్న అని అన్నారు. స్వాతంత్ర పోరాట ఉద్యమంలో తనదైన ముద్ర వేశారన్నారు.

ఏలూరు: ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ, వివి.గిరి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి ఎందరో నాయకులతో కలిసి సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొని, జైలు జీవితాన్ని అనుభవించారన్నారు. గౌతు లచ్చన్న సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలు ఆయనకు సర్దార్ అనే బిరుదు ఇచ్చారన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి గౌతు లచ్చన్న అని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, సూపరింటెండెంట్ చల్లన్నదొర, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారులు టి.వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

పల్లెలకు బస్సులెళ్తేనే.. ఉచితం సముచితం..!



స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రెండు జిల్లాల్లో ఆర్భాటంగా ప్రారంభమైంది. మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు ఈ బస్సులకు పచ్చజెండా ఊపడమే కాక బస్సుల్లో ప్రయాణించి కండక్టర్ అవతారంలో మహిళలకు జీరో టిక్కెట్లు జారీ చేశారు. ఇది కచ్చితంగా స్వాగతించదగిన పథకమే. అదే సమయంలో తమ ఉపాధి మాటేమిటంటూ ఆటో కార్మికులు సైతం రోడ్డెక్కారు. ఎందుకంటే చాలామంది బ్యాంకు అప్పులు, ప్రయివేటు ఫైనాన్స్‌లో ఆటోలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. కచ్చితంగా వారి ఉపాధి దెబ్బతినకుండా ప్రత్యామ్నాయ చర్యలు ప్రభుత్వం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే సమయంలో ప్రయాణికుల అవసరాలు, ప్రధానంగా గ్రామీణ ప్రజల రవాణా అవసరాలు తీర్చేలా బస్సులు నడిపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రెండు జిల్లాల్లో 85 రూట్లలో మహిళలు ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ రెండు జిల్లాల పరిధిలోని ఏడు ఆర్‌టిసి డిపోల్లో 607 బస్సులు ఉండగా వాటిలో నాలుగొందల బస్సులు ఉచిత ప్రయాణానికి అనువైన సర్వీసులుగా తిరుగుతున్నాయి. మిగిలిన బస్సులు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎసి బస్సులు కావడంతో వాటిలో రాకపోకలు సాగించే అవకాశం లేదు. అయితే ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు స్వాగతిస్తున్నా బస్సుల సంఖ్య, రూట్ల సంఖ్య పెంచాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల కొందరు ఎంఎల్‌ఎలు సైతం బహిరంగంగానే ఆర్‌టిసి అధికారులను కోరారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్రంలో పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండే జిల్లాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు పేరుంది. ఇక్కడ జన సాంద్రత కూడా ఎక్కువ. అయితే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రోడ్డు కనెక్టివిటీ చాలా గ్రామాలకు ఉన్నా, బస్సు సౌకర్యం లేని గ్రామాలు సగానికిపైగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి జిల్లాలో ఇరగవరం మండలం పరిశీలిస్తే రోడ్డు కనెక్టివిటీ ఉన్నా పెద్దసంఖ్యలో గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేదు. కనీసం ఆ మండల కేంద్రానికే సరైన బస్సు సౌకర్యం లేకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి ఆచంట, నరసాపురం, ద్వారకాతిరుమల, కామవరపుకోట, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాలతోపాటు ఏజెన్సీలో గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేదు. ఇక కుక్కునూరు, వేలేరుపాడు మండలాల వాసులైతే మన ఆంధ్రా బస్సులు లేకపోవడం, మధ్యలో కొంత తెలంగాణా ఉండటంతో వారికి ఉచితం అందని ద్రాక్షగానే మిగులుతోందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత గతంలో రద్దు చేసిన రూట్లలో బస్సులను పునరుద్ధరించడంతోపాటు జనావసరాలకు అనుగుణంగా కొత్త రూట్లలోనూ పల్లెవెలుగు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే దూర ప్రాంత ప్రయాణాలకు సూపర్‌లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులే ఎక్కువగా నడుపుతున్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాల్లో తిరిగేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడే అవకాశం ఉంది. అలాకాకుండా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పెంచితే కనీసం సమీప నగరాలకైనా మహిళలు ఉచితంగా వెళ్లొచ్చే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, ఆర్‌టిసి చర్యలు తీసుకుంటే కచ్చితంగా స్త్రీ శక్తికి తగిన గుర్తింపు ఇచ్చినట్లని గ్రామీణ ప్రాంత మహిళలు అభిప్రాయపడుతున్నారు.

ఇక అదే సమయంలో ఆటో కార్మికులు ఈ నెల 14న ఆందోళనబాట పట్టారు. ఉచిత బస్సుకు తాము వ్యతిరేకం కాదని, తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలనేది వారి డిమాండ్. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఆటో కార్మికుల సేవలు తప్పనిసరి. అత్యవసర పరిస్థితుల్లోనూ ఆటో కార్మికులు అందించే సేవలు ఎనలేనివి. ఈ క్రమంలో ప్రభుత్వం వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటేనే గ్రామీణులకు ఎటువంటి ఇబ్బందీ ఉండదు. లేనిపక్షంలో ఇటు ఆటో కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వైపు వెళ్తే గ్రామీణ ప్రజలు రవాణా సదుపాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందనే చందంగా కాకుండా ఉచిత బస్సు పథకం కొనసాగాలంటే కచ్చితంగా ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

రేపు డిఆర్‌సి సమావేశం

విచ్చేయనున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఈ నెల 18వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ,ఉద్యానవన,పంచాయతీ రాజ్, అర్ అండ్ బి, ఆర్డబ్ల్యూ ఎస్ పెండింగ్ పనులు,గ్యాప్ అనాలిసిస్ రిపోర్ట్,యం.ఎస్.యం.ఈ పార్కు లు,పౌరసరఫరాలు, స్త్రీ శక్తి పథకం, గోదావరి వరద రిలీఫ్ ఆపరేషన్స్ తదితర అంశాలపై సమీక్షిస్తారు.

సిపిఎం ఆశయాల కోసం శ్రమించిన దుర్గారావు

సంస్మరణ సభలో రాష్ట్ర నాయకులు తులసిరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎలినేని దుర్గారావు సిపిఎం ఆశయాల కోసం అహర్నిశలు శ్రమించారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్. తులసిరావు అన్నారు. పట్టణంలోని జిపి గ్రాండ్‌లో శనివారం ఎలినేని దుర్గారావు సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్.తులసిరావు మాట్లాడుతూ దుర్గారావు జీవితాంతం నమ్మిన సిద్ధాంతం కోసం, సిపిఎం ఆశయాల అమలు కోసం అహర్నిశలు శ్రమిస్తూ చివరి వరకు ఆ పార్టీ నీడలో ఉన్నారన్నారు. దుర్గారావు త్యాగాలను, ఆయన ఆశయాలను ఈ తరం మనమందరం కూడా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ సిపిఎం వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.కేశవరావు, బి.సత్యప్రసాద్, ఎన్ఆర్.హనుమాన్లు, ఎకెడి.ప్రసాద్, వసంతరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు చలసాని రామారావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తులసిరావు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. గతేడాది విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 550 మార్కులకు పైగా సాధించిన ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్ విద్యార్థులకు కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ గోకుల కృష్ణ యాదవ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు, మెమోరాండం అందించారు. విద్యార్థులను శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్, ట్రస్ట్ ఫౌండర్, ట్రెజరర్ ఆర్ల గోపాలకృష్ణ, ప్రెసిడెంట్ చిర్రా కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మానికల గంగాధర్, కార్యనిర్వాహక కార్యదర్శి చింతా నాగమణి, పాకనాటి సీతారామ్, తట్టుకోల నాగేశ్వరరావు, పుసునూరు గోపాలకృష్ణ, బండారు నాగరాజు,పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్, బీరువా అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

తాము చదివిన పాఠశాలకు ఎంతో కొంత ఆర్థిక చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో మైక్ సెట్, బీరువా అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.32 వేల విలువైన మైక్ సెట్, సుమారు రూ.30 వేల విలువైన బీరువా వితరణగా అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులైన ఈనాడు శ్రీను, పి.ఆంజనేయులు, తదితరులులను ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు, గ్రామ ప్రముఖులు దేవినేని వరప్రసాదరావు, ఉపాధ్యాయులు గంగుల నాగేశ్వరరావు అభినందించారు.

పామాయిల్ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

పామాయిల్ కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సంఘం జిల్లా నాయకులు డి.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా నాగరాజు, కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా టి.నర్సాపురం, కె.జగ్గవరం, బంధంచర్ల, మల్లప్పగూడెం, వెంకటాపురం, వీరభద్రవరం, మక్కినవారిగూడెం, సూరంపూడి గ్రామాలకు చెందిన కార్మికులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 19వ తేదీన ఏలూరులో కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి కార్మికులు పాల్గొనాలని నాయకులు కోరారు. నెలాఖరు లోపల జంగారెడ్డిగూడెం నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులకు పనిముట్లు, గ్రూప్ ఇన్సూరెన్స్ యాజమాన్యం కల్పించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వారు తెలిపారు.

ముదినేపల్లి సర్పంచికి మాతృవియోగం

నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి-ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ మాతృమూర్తి ఇంటేటి పిచ్చమ్మ(86) శనివారం తెల్లవారుజామున ముదినేపల్లిలోని స్వగృహంలో మరణించారు. పిచ్చమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిచ్చమ్మ పెద్ద కుమార్తె నిమ్మగడ్డ కైకమ్మ ముదినేపల్లి గ్రామ సర్పంచిగా విధులు నిర్వహిస్తున్నారు. పిచ్చమ్మ పెద్ద కుమారుడు ఇంటేటి శేషగిరిరావు గతంలో ముదినేపల్లి-2 ఎంపిటిసిగా పనిచేశారు. పిచ్చమ్మ సోదరుడు నిమ్మగడ్డ బిక్షాలు (సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ భర్త) దళిత నాయకుడిగా, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కొనసాగుతున్నారు. పిచ్చమ్మ అంత్యక్రియలు ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. పిచ్చమ్మ మృతి వార్త తెలుసుకున్న వెంటనే పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, స్థానికులు పిచ్చమ్మ పార్థీవదేహాన్ని సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.


పిచ్చమ్మ (ఫైల్ ఫొటో)

పశువుల రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వర్షాలు, వరదల నేపథ్యంలో పశువులకు ప్రాణ నష్టం వాటిల్లకుండా పశువుల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి కె.కోటేశ్వరరావు సూచించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధిక వర్షాలకు రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించడం ద్వారా పశువులకు ఎటువంటి హానీ జరగకుండా చుడొచ్చన్నారు. పశువుల షెడ్లు గాలివానలకు కూలిపోకుండా ముందుగానే మరమ్మతులు చేయించాలన్నారు. పశువులకు నట్టల నివారణ మందులు, వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. వర్షాకాలంలో ముంపు బారిన పడకుండా ఎత్తైన ప్రదేశాల్లో ఉంచాలన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉంచాలని అవసరాలకు అనుగుణంగా దాణా, మేతను నిల్వ ఉంచుకోవాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు

రూ.40 వేల విలువైన గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - భీమడోలు


గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చారు. భీమడోలు సిఐ యుజె.విల్సన్ తెలిపిన వివరాల ప్రకారం... భీమడోలు ఎస్ఐ సుధాకర్ తన సిబ్బందితో పొలసానిపల్లి సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు బైక్‌లపై వస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ, వారి సిబ్బంది వెంటాడి వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40 వేల విలువైన 2.13 కేజీల గంజాయిని, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చేబ్రోలుకు చెందిన ఎం.శామ్యూల్, కైకరానికి చెందిన ఆర్.లక్ష్మీనారాయణ, ముసళ్లగుంటకు చెందిన సిహెచ్.రవిబాబు, ముసళ్లగుంటకు చెందిన నిశాంత్‌గా గుర్తించారు. వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

టి.నరసాపురం :వ్యక్తి అదృశ్యంపై టి.నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏపిగుంట పంచాయతీలోని బచ్చులేటిగూడెం గ్రామానికి చెందిన పొడియం రవికి భార, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యభర్తల మధ్య గొడవల కారణంగా రవి భార్య పుట్టేపు గ్రామంలో పుట్టింటి వద్ద ఉంటుంది. రవి అప్పుడప్పుడు భార్య దగ్గరకు వెళ్లి కొన్నిరోజులు ఉండి ఇంటికి వస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన ఉదయం మోటారుసైకిల్‌పై ఇంటి వద్ద నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. రవి తండ్రి పొడియం నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి


మహాసభలో మాట్లాడుతున్న నాగమణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్‌కె.మస్తాన్ ఆధ్వర్యాన ఆరో మండల మహాసభ నిర్వహించారు. ఈ మహాసభను ఉద్దేశించి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్మికుల శ్రమను దోచుకునే విధంగా ప్రభుత్వాలు కార్పొరేట్లకు చట్టాలు చేసి పెడుతున్నాయన్నారు. కార్మికుల వేతనాలు పెంచడం లేదు కాని రోజురోజుకి నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు. చాలీచాలని వేతనాలు ఇచ్చి వారి శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తానన్న గెలిచాక కాంట్రాక్ట్ పద్ధతిని పొడిగిస్తూ వస్తుందే తప్ప వారికి భద్రత కల్పించడం లేదన్నారు. వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని 13 మందితో ఎన్నుకున్నారు. సిఐటియు మండల కార్యదర్శిగా సిహెచ్.కొండలరావు, కో-కన్వీనర్‌గా ఊర్ల నాగమణి, పి.రమణ, వరలక్ష్మి, ఎస్‌కె.మస్తాన్, కమిటీ సభ్యులుగా పి.స్వర్ణ, గాంధీ, మంగ, అనసూర్య, రమణ, రాజశేఖర్, జగదా, పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు, ఎస్.శేషగిరిరావు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మరిపి కళ్యాణి, పత్తిపాటి సూర్య నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించారని పాఠశాల హెచ్ఎం విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.12 వేల చొప్పున నాలుగేళ్లు అందిస్తుందని తెలిపారు. గ్రామ ప్రముఖులు వీరమాచనేని సత్యనారాయణ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఇద్దరు విద్యార్థులకు నగదు బహుమతి రూ.2500 చొప్పున అందించారన్నారు. ఇదే తరహాలో ప్రతి ఏడాది ఈ పాఠశాలలోని విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఉండాలన్నారు. స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులను గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు అభినందించారు. గ్రామ ప్రముఖులు చలసాని రామారావు గతేడాది పదో తరగతిలో పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతి అందించారు.

శ్రీవారి ఆలయానికి కూరగాయల వితరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో నిత్యం వేలాది మంది యాత్రికులు ఉచిత భోజనాలు చేస్తూ ఉంటారు. యాత్రికుల ఉచిత భోజనాల సౌకర్యార్థం స్వామివారి అన్నదానం ట్రస్టుకు నూజివీడుకు చెందిన నక్కా సత్యనారాయణ సుమారు మూడు టన్నుల కూరగాయలు కానుకగా అందించారు. దాతకు ఆలయ అన్నదాన విభాగం అధికారులు అభినందనలు తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఛత్రపతి శివాజీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, టగ్ అఫ్ వార్, ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్‌లో డి.వెంకటలక్ష్మి మొదటి స్థానం, టి.దివ్య రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బాలుర ఉట్టి కొట్టే కార్యక్రమంలో కె.వరకుమార్, బాలికల ఉట్టి కొట్టే కార్యక్రమంలో వై.వైష్ణవి, తాడు లాగే పోటీలో బాలురు బి.పవన్ జట్టు, బాలికలు పి.ప్రసన్న జట్టు ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ముదినేపల్లి : మండలంలోని అల్లూరు గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి మొదటి వార్షికోత్సవ వేడుకల్లో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, బొమ్మినంపాడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఎర్రా శ్రీరాములు, వైసిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని పలు ప్రయివేట్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

వ్యసనాల బారిన పడొద్దు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని ఎస్ఐ వి.క్రాంతికుమార్ విద్యార్థులకు సూచించారు. శనివారం గిరిజన గురుకుల బాలుర వసతి గృహంలో మాదక ద్రవ్యాల నిరోధం, పోక్సో చట్టాలు, సైబర్ నేరాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువతపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ శ్రీరాములు, పీడీ రమేష్, రత్తయ్య, స్టేషన్ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు, సిబ్బందికి డిపిఆర్ఒ అభినందన


ప్రశంసాపత్రం అందుకుంటున్న దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గుర్తింపుగా డివిజనల్ పిఆర్ఒ సిహెచ్‌కె.దుర్గాప్రసాద్, ఉత్తమ ఫొటోగ్రాఫర్ పి.సాగర్, ఆఫీసు సబార్డినేట్ కుమారి ఎంఎం.రేష్మా ఉత్తమ సేవాల పతకాలు పొందారు. వీరిని డిపిఆర్ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు అభినందించారు. మరింత ఉత్తమ పనితీరు కనబరచి భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ పతకాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు.

జారిన ఎగువ కాపర్ డ్యామ్

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు ఎగువ కాపర డ్యామ్‌కు ఎడమవైపు ఎగువన కొద్దిగా జారింది. శుక్రవారం ఉదయం సమయంలో సుమారు పది అడుగుల వెడల్పు, ఏడు నుంచి ఎనిమిది అడుగుల లోతు మేర జారింది. దీనిని గమనించిన అధికారులు యుద్ధప్రాతిపదికన పటిష్టపరిచారు. 2022 ఆగస్టు వరదలకు ఆ ప్రదేశంలో నీటిమట్టం ఎక్కువగా పెరిగే అవకాశాలున్నాయని భావించిన అధికారులు ఎగువ కాపర్ డ్యామ్ వెడల్పు తొమ్మిది మీటర్ల ఎత్తు, మరో రెండు మీటర్ల మేర పెంచి పటిష్టం చేశారు. అదే ప్రాంతంలో ప్రస్తుతం కొంతమేర జారింది. సీపేజీ నివారణ కోసం విదేశీ నిపుణుల బృందం సిఫార్సు చేసిన మేరకు ఎగువ కాపర్ డ్యామ్ పొడవునా బట్రస్ డ్యామ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. జారిన భాగాన్ని పునరుద్ధరించామని, బట్రస్ డ్యామ్ ఉండడం వల్ల ఎలాంటి సమస్య ఉండదని ఇంజినీరింగ్ ఛీఫ్ నరసింహమూర్తి స్పష్టం చేశారు. ఈ విషయంపై పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో ఇంజినీరింగు అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.


జారిన ఎగుక కాపర్ డ్యాం

పేదలకు మెరుగైన వైద్యం : మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

పేదలకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు కేటాయించి ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తుందని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండల పరిధిలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కె.నాగబాబు కుటుంబానికి రూ.రెండు లక్షల ఎల్‌ఒసి పత్రాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా మంత్రికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, సర్పంచి పులిబళ్ల లక్ష్మీ సత్యనారాయణ, జనసేన నాయకులు పాశం నాగబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర స్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీలకు నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల తొమ్మిదో తలగతి విద్యార్థిని ఎస్.జాస్మిత ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.హేమలత తెలిపారు. మరో విద్యార్థి అమలారాణి ట్రెడిషనల్ జూనియర్ స్థాయి యోగా పోటీల్లో మూడో స్థానంలో నిలిచి మెడల్ సాధించిందన్నారు. వీరిద్దరిని పాఠశాల ఆవరణలో శనివారం సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన ఏలూరులోని ఓల్డేజ్ హోమ్‌లో జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో ఎస్.జాస్మిత ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందని చెప్పారు. ఆమె ఈ నెల 22న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. మరోవిద్యార్థిని అమలారాణి రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులను వారికి తర్ఫీదు ఇచ్చిన పిఇటి బాలభారతిని ప్రిన్సిపల్‌తో పాటు పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసి కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎటిపి శ్రీదివ్య, బాలభారతి, ఎస్ఎంసి ఛైర్మన్ నాగరాజు, సభ్యులు లలిత, లక్ష్మీనారాయణ, పరమేష్, నాగరాణి, లావణ్య, ప్రశాంతి, నాగేశ్వరి, శిరీష, సతీష్ ఉన్నారు.

స్ఫూర్తివంతమైన సేవలు అభినందనీయం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ఏలూరు సిటీ :స్ఫూర్తివంతమైన సేవలను ఆదర్శవంతంగా ముందుకు తీసుకెళ్లడం ఎంతో అభినందనీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ప్రశంసించారు. మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవావారోత్సవాల్లో భాగంగా ఏలూరు మాదేపల్లి రోడ్డులోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శనివారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి వృద్ధులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన జరగనున్న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను వారంరోజుల పాటు నిర్వహించాలనే ఆలోచన చేయడంతో పాటు అవసరార్థులకు సాయమందించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, జనసేన నాయకులు, ఎన్ గ్రూప్స్ అధినేత నారా శేషు, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మారం అను, అధ్యక్షులు శానం శ్రీరామకృష్ణ, సభ్యులు జగన్, సురేష్ మాస్టర్, పవన్, దేవరపల్లి పెదబాబు, ఆది, అరవింద్ పాల్గొన్నారు.

ఘనంగా గుణ్ణం సురేష్ పుట్టినరోజు వేడుక

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం మాజీ సర్పంచి, కీర్తిశేషులు రామచంద్రరావు కుమారుడు గుణ్ణం సురేష్ పుట్టినరోజు సందర్భంగా జిఆర్‌సిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సురేష్‌బాబు యూత్ ఆధ్వర్యంలో శనివారం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా నారాయణపురం పంచాయతీ కార్యాలయం వద్ద రామచంద్రరావు విగ్రహం వద్ద గ్రామస్తులు నివాళులర్పించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, కార్యాలయ సిబ్బందికి వస్త్రాలు, ఆశావర్కర్లకు చీరలు, చేబ్రోలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు, 50 మంది ఎయిడ్స్ పేషెంట్లకు నెలకు సరిపడా ప్రొటీన్ ఫుడ్ అందించారు. ఉంగుటూరు అనాధాశ్రమం పిల్లలకు బిర్యానీ అందించారు. ఈ కార్యక్రమంలో రీషి యూత్, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన గౌతు లచ్చన్న

ఉమ్మడి జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న మహనీయులు సర్దార్ గౌతు లచ్చన్న అని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. శనివారం గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌతు లచ్చన్న సాధారణ కుటుంబం నుంచి ఎదిగి, స్వాతంత్ర సమరయోధుడిగా, రైతులకు, కూలీలకు మద్దతుదారుడిగా, పేదల పక్షపాతిగా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. జిల్లా పరిషత్ సిబ్బంది అందరూ గౌతు లచ్చన్న ప్రజాసేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజల కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఏలూరు సిటీ : ధైర్యసాహసాలకు, కార్యదక్షతకు ప్రతీకగా నిలిచి, ఉన్నతాశయంతో సర్దార్ గౌతు లచ్చన్న నడయాడిన తీరు ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు రెండో డివిజన్‌లోని గౌతు లచ్చన్న స్మారక భవనంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయనకు నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శంఖ బాలయోగి, పుప్పా రాంబాబు, సింగవరపు ప్రసాద్, తీయాల రవి, లొట్టి రమేష్, నొడగాని సురేష్, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, నేతలు

ముదినేపల్లి :సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు గౌడ కులస్తులంతా పని చేయాలని విగ్రహ దాత, శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు కోరారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతిని పురస్కరించుకుని ముదినేపల్లి సంత మార్కెట్ వద్ద ఏర్పాటుచేసిన లచ్చన్న విగ్రహానికి శనివారం గౌడ సంఘ నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరసా కనకారావు, వీరమల్లు నరసింహారావు, ఈడే సుధాకర్, వీరంకి వెంకయ్య, బొర్రా శేషుబాబు, జోగి సురేష్, దావు నాగరాజు, వీరంకి చక్రపాణి, పరసా కృష్ణ, వీరమల్లు రాము, వీరంకి శ్రీనివాసరావు, శొంఠి కుమార్‌స్వామి, ఈడే ఉమామహేశ్వరరావు, పామర్తి గోపీ, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు ఆధ్వర్యంలో మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు 200 మంది మహిళలతో ప్రత్యేక కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు సాయిల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ తాళ్లూరి వెంకటేశ్వరరావు, బిసి సెల్ మండలాధ్యక్షులు బూస సత్యనారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాగాని శ్రీనివాసరావు, బిసి సెల్ మండల ఉపాధ్యక్షులు రాగాని రామకృష్ణ, గ్రామ కార్యదర్శి తడికల దావీదు, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పులపాకుల ప్రసాద్, బలుసు కిరణ్, కొటూరు ప్రసాద్, మంగతాయారు, విజయలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంపీ మహేష్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో శనివారం కలిసి ఏలూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలేరుపాడులో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, నూజివీడు ట్రిపుల్ ఐటీకి రూ.13 కోట్లు, ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.12 కోట్లు, ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.మూడు కోట్లు మంజూరు చేయాలని, మరికొన్ని అంశాలను మంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్లి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని, వీలైనంత త్వరలో అన్నిటినీ పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి - భీమడోలు

పుట్టినరోజును పురస్కరించుకుని వికలాంగులకు అన్నదానం చేసిన దాత అభినందనీయులని గుండుగొలను విఘ్నేశ్వరా వికలాంగుల సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. గ్రామానికి చెందిన దాత అద్దాల గోపీరాజు పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు సేవా సమితికి చెందిన వందమంది వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతల ఔదార్యాన్ని పలువురు వక్తలు కొనియాడారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం

ఎపిజిఇఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంఘ జిల్లా కార్యాలయంలో శనివారం ప్రభుత్వ రికగ్నిషన్ డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని ఆ సంఘ నాయకత్వం సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్య నారాయణ నాయకత్వంలో సంఘాన్ని సమున్నత స్థానంలో ఉంచటానికి కృషి చేస్తామన్నారు.

'బిఎస్‌పి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాలితులుగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలంతా ఐక్యంగా ఉండి పాలకులుగా మారాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సంపత్‌రావు అన్నారు. ఏలూరులోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) ముఖ్య నాయకుల సమావేశంలో సంపత్‌రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో అంబేద్కర్ ఆలోచనా విధానంతో, కాన్షీరామ్ పని విధానంతో బిఎస్‌పిని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.